ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
ఆదివారం 1 సెప్టెంబరు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 27.0 కనిష్ఠం : 25.0
తణుకు : 27.0 - 25.0



పెనుమదంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జోరువానలో పింఛన్ల పంపిణీ

మిగిలిన 14,382 మందికి రేపు అందజేత

భీమవరం టౌన్, ఆగస్టు 31 : జోరువానలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం తెల్లవారుజామున ఐదున్నర గంటల నుంచి మొదలైంది. ఓ వైపు వర్షంలో.. మరోవైపు ఒకరోజు ముందుగా పింఛన్ల సొమ్ము చేతికి రావడంతో పేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 31 వేల 75 మంది పింఛనుదారులకు రెండు లక్షల 16 వేల 693 మందికి అందజేశారు. మిగిలిన 14 వేల 382 మందికి సోమవారం అందిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు పంపిణీ 93.84 శాతంగా నమోదైంది. జిల్లాలో మండలాలు, మునిసిపాల్టీల వారీగా పింఛన్ల పంపిణీ ఇలా ఉంది.

మండలం	ఇచ్చినవి	పెండింగ్	శాతం
ఆకివీడు (అర్బన్)	2798	461	85.85
ఆకివీడు	4943	483	91.10
కాళ్ళ	8121	785	91.19
మొగల్తూరు	9860	833	92.21
వీరవాసరం	7987	653	92.44
నరసాపురం(అర్బన్)	5320	417	92.73
నరసాపురం	10357	801	92.82
భీమవరం	10653	751	93.41
ఉండి	8291	585	93.41
గణపవరం	8216	568	93.53
పాలకోడేరు	8644	597	93.54
భీమవరం(అర్బన్)	10519	724	93.56
పెనుగొండ	8248	566	93.58
పెంటపాడు	9221	632	93.59
యలమంచిలి	9756	648	93.77
ఆచంట	7660	498	93.90
అత్తిలి	9043	550	94.27
పాలకొల్లు	8649	495	94.59
తణుకు	8492	472	94.73
పాలకొల్లు(అర్బన్)	5627	302	94.91
తణుకు(అర్బన్)	8089	420	95.06
తాడేపల్లిగూడెం	11983	599	95.24
పెనుమంట్ర	7959	397	95.25
తాడేపల్లిగూడెం(అర్బన్)	8898	399	95.71
పోడూరు	8271	362	95.81
ఇరగవరం	9088	384	95.95
	2,16,693	14,382	93.78

పింఛన్ పంపిణీలో ఇబ్బందులు రానివ్వం : మంత్రి నిమ్మల

పోడూరు, ఆగస్టు 31: వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు నెలా నెలా ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రానివ్వబోమని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పెనుమదంలో శనివారం ఉదయం ఆయన వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. సమాజంలో ఆదరణ లేక నిరాదరణకు గురైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా కాకుండా పింఛన్ మొత్తాన్ని ఒకేసారి పెంచి ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. పెన్షన్‌దారుల కళ్లల్లో కనబడుతున్న ఆనందం తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు.

పేదలకు ఇబ్బంది కలగకూడదనే : కలెక్టర్



పెద అమిరంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ళ, ఆగస్టు 31 : పేదలకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కాళ్ల మండలం పెద అమిరం ఎస్సీ కాలనీలో శనివారం ఉదయం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. దివ్యాంగులైన చిట్టూరి పుష్పావతి, అనుపోజు రాంబాబులకు రూ.6 వేలు చొప్పున, వితంతువులైన దీపాటి శాంతకుమారి, ఆదితల మార్తమ్మ, గోడి మరియమ్మలకు రూ.4 వేలు చొప్పున, కలిపల్లి వెంకటేశ్వరరావు, దీపాటి అభిమన్యుడులకు వృద్ధాప్య పింఛన్లు రూ.4 వేలు చొప్పున కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. గుడిసెల్లో వున్న లబ్ధిదారుల వద్దకు స్వయంగా వెళ్లి వారి యోగక్షేమాలు ఆరా తీసి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

నేడు రేషన్ సరఫరా

బియ్యం ఉచితం.. నగదుకు పంచదార



భీమవరం టౌన్/ఉండి, ఆగస్టు 31 : రేషన్ కార్డుదారులకు సెప్టెంబరు నెల కోటాను ఇంటింటికి అందించేం దుకు ప్రభుత్వం సరుకులను సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు పంపిణీని ప్రారంభిస్తారు. ఐదు లక్షల 67 వేల 651 కార్డుదారులకు ఎనిమిది వేల 700 మెట్రిక్ టన్నుల బియ్యంను సరఫరా చేసింది. వీటిని ఉచితంగా పంపిణీ చేయనున్నారు. బియ్యంతో పాటు ఈ నెల నుంచి అరకేజీ పంచదార ప్యాకెట్‌ను రూ.17లకు విక్రయిస్తారు.





భారీ వర్షానికి జలమయమైన నరసాపురం, ఆకివీడు, మొగల్తూరు ప్రధాన రహదారులు



ముంచిన వాన

భీమవరం టౌన్/ఉండి, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లావ్యాప్తంగా శనివారం భారీ, అతి భారీ వర్షాలు కురిశాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. అనేకచోట్ల వృక్షాలు నేలవాలాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కొనసాగడంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. పాఠశాలలను మూసివేశారు. కొన్నిచోట్ల శనివారం మధ్యాహ్నం నుంచి విద్యార్థులను ఇళ్ళకు పంపేశారు. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపారాలు లేక వ్యాపారులు, పనులు లేక కూలీలు ఇబ్బందులు పడ్డారు. వర్షంతోపాటు చలి గాలులు తోడయ్యాయి. డ్రెయిన్లు పొంగడంతో రోడ్లపైకి నీరు చేరింది. చాలా ప్రాంతాల్లో మోకాలి వరకు నీరు వచ్చింది. భీమవరం టూ టౌన్ సీతా టవర్‌లోని సెల్లార్‌లోకి వర్షపు నీరు చేరింది. ఏఎస్ఆర్ నగర్‌లో పలు వీధులు మునిగాయి. పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాలతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే చాలాచోట్ల జ్వరాలు వెంటాడుతున్న నేపథ్యంలో మళ్లీ వర్షాలతో పరిస్థితి ఎలా ఉంటుందనే భయాందోళన వ్యక్తమవు తోంది. పలుచోట్ల డెంగ్యూ మరణాలు సంభవించాయన్న వార్తలు ప్రజలను ఆందోళన వైపు పరుగులు పెట్టిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు పాఠశాలలకు సెలవు ప్రకటించగా ప్రైవేట్ పాఠశాలలు మధ్యాహ్నం వరకు కొనసాగించి విద్యార్థులను పంపించివేశారు. వర్షాలు మరో రెండు రోజులపాటు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇటీవల మేజర్ డ్రెయిన్లకు ప్రభుత్వం మరమ్మతులు చేయించడంతో భారీవర్షాలు కురిసిన పంటలకు ఏ విధమైన ఇబ్బంది కలగలేదు. జిల్లాలో గడిచిన 24 గంటల్లో పాలకొల్లులో 199.4 మి.మీ. మేర భారీ వర్షం కురిసింది. నరసాపురం 131.4, పెనుమంట్ర 110.4, భీమవరం 105.6, యలమంచిలి 102.2, వీరవాసరం 100.4, పోడూరు 98.8, ఉండి 98.6, ఆచంట 95.2, కాళ్ల 91.2, పాలకోడేరు 90.4, అత్తిలి 89.4, పెనుగొండ 89.2, ఇరగవరం 85.4, మొగల్తూరు 84.4, ఆకివీడు 79.2, గణపవరం 74.4, తాడేపల్లిగుడెం 73.2, పెంటపాడు 63.8, తణుకు 60.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

లోతట్టు ప్రాంతాలు జలమయం
స్తంభించిన జన జీవనం.. నేడు భారీ వర్షాలు
అధికార యంత్రాంగం అప్రమత్తం
కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరు జిల్లాలో అతి భారీ వర్షాలకు నూజివీడు పెద్ద చెరువుకు గండి పడడంతో నివాస ప్రాంతాల్లోకి వరదనీరు చొచ్చుకువెళ్ళింది. పెద్ద సంఖ్యలో కుటుంబాలు జల దిగ్బంధనానికి గురయ్యాయి. ఇంటికి ఇంటికి మధ్యన తాళ్ళు కట్టుకుని మరీ సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు ప్రయత్నించారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ఏ క్షణాన్నయినా విద్యుత్ లైన్లపై విరిగిపడే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిందిగా ట్రాన్స్‌కో ప్రజలను అప్రమత్తం చేసింది. ద్వారకా తిరుమల శ్రీవారి దర్శనానికి వేలాది మంది భక్తులు వర్షం వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భారీ వర్షాల నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రానున్న ఒకటి, రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శనివారం ఆమె జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులు వారి ప్రధాన కార్య స్థానాల్లో అందుబాటులో ఉండి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా 08816 299219 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాల కారణంగా ఏదైనా ఇబ్బందులు ఎదురైతే ఈ నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలైన పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి కావలసిన సదుపాయాలు కల్పించాలన్నారు. బలహీనంగా వున్న కాలువలు, డ్రెయిన్లను ఇరిగేషన్ అధికారులు పరిశీలించి పటిష్టచర్యలు తీసుకోవాలన్నారు.

రైళ్లు రద్దు.. హెల్ప్‌లైన్లు ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో కొన్ని రైళ్లను రద్దు చేయగా, కొన్నింటిని దారి మళ్లించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ముందస్తుగా ప్రయాణికుల రక్షణార్థం అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ప్రయాణికులు, ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ - 75693 05697, రాజమండ్రి - 0883-2420541, 2420543, తుని - 78159 09479, నెల్లూరు - 78159 09479, ఒంగోలు - 78159 09489, గూడూరు - 08624-250795, గుడివాడ - 78159 09462, భీమవరం టౌన్ - 78159 09402, నిడదవోలు - 08813-223325, తాడేపల్లిగూడెం - 08818- 226162, తెనాలి - 08644-227600, ఏలూరు - 78519 09348 ఈ నెంబర్లకు కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు.

పలు రైళ్లు రద్దు.. -5లో..










భీమవరంలో భారీ వర్షానికి నీట మునిగిన రహదారులు

పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందరపర్రులో కూలిన భారీ వృక్షం



సీఎం సీరియస్

- ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- డైరెక్టర్ తొలగింపు.. త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- మంత్రి పార్థసారథి రెండోసారి ఆకస్మిక తనిఖీ
- మళ్లీ అదే ఆహారం.. మెస్ నిర్వాహకులపై ఆగ్రహం
- మరో 59 మందికి జ్వరాలు.. చికిత్స

నూజివీడు, ఆగస్టు 31: నూజివీడు ట్రిపుల్ ఐటీని గాడిన పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వారం రోజులుగా కలుషిత ఆహారం కారణంగా వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై విద్యార్థులు ఇక్కడి సమస్యలను లేఖ ద్వారా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా క్యాంపస్‌లో వరుస పరిణామాలపై సీరియస్ అయ్యారు. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో పర్యవేక్షణకు త్రిసభ్య కమిటీని మంత్రి నారా లోకేశ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యా శాఖ ఇన్‌చార్జ్ చైర్మన్ రామ్మోహన్ రావు, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని సభ్యులుగా నియమించారు. కమిటీ దృష్టి సారించే పలు అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత నిర్వహణకు, క్యాంపస్‌లో పారిశుధ్యం, మెస్ పరిశుభ్రతకు ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొటోకాల్ అమలు. లైంగిక వేధింపులపై ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి' అని ఉత్తర్వుల్లో మంత్రి పేర్కొన్నారు.

నాణ్యత లేని ఆహారం వల్లే జ్వరాలు : మంత్రి

ట్రిపుల్ ఐటీలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలపై సీఎం చంద్ర బాబు సీరియస్‌గా ఉన్నట్టు మంత్రి పార్థసారథి విలేకరులకు తెలిపారు. శనివారం రెండోసారి ఆయన క్యాంపస్‌ను సందర్శించి మెస్‌లోని వంటశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నాణ్యత లేని ఆహారం, పారిశుధ్యం లేకపోవడంతోనే విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. గత జగన్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలు చెల్లించకపోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడింది. క్యాంపస్‌లో ప్రతి మెస్‌కు ఫుడ్ టెక్నాలజీలో అర్హత ఉన్న వారిని అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించాలని అధికారులకు సూచించాం. ఫ్యాకల్టీ, సెక్యూరిటీ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించే సమయంలో వారికి ఎలాంటి నేరచరిత్ర లేని వారిని మాత్రమే తీసుకోవాలి. దీనికి పోలీసుల సహకారం పొందాలి. విద్యార్థుల సౌకర్యాల విషయంలో స్పష్టమైన మార్పులు రావాలి. నాణ్యమైన ఆహారం, చదువుకోవడానికి చక్కని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం' అని మంత్రి తెలిపారు.



మెస్‌లో పార్థసారథి తనిఖీ

మళ్లీ అదే ఆహారం.. విద్యార్థుల అసంతృప్తి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మంత్రి, జిల్లా అధికారులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు పలుమార్లు హెచ్చరించినా మెస్ నిర్వాహకులు తీరు మారలేదు. శనివారం కూడా అదే నాణ్యత లేని ఆహారాన్ని అందిచారని విద్యార్థులు వాపోయారు. ఆహారం రుచి చూసిన మంత్రి పార్థసారథి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా మెస్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడానికి కారణంపై విద్యార్థుల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. మెస్‌ల్లో తమకు అందుతున్న ఆహారాన్ని రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి పెట్టకుండా మెస్ నిర్వాహకులను బుజ్జగించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. శనివారం ట్రిపుల్ ఐటీలో జ్వరాల బారిన పడి మరో 59 మంది విద్యార్థులు అవుట్ పేషెంట్‌గా చికిత్స పొందారు. ఇప్పటికే వందలాది మంది జ్వరాల బారినపడి కోలుకున్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్లు ఫుడ్ కోర్టుకే..!

ట్రిపుల్ ఐటీ నూజివీడు మున్సిపాలిటీకి ఏటా లక్షలాది రూపాయలు ట్యాక్స్ రూపేణా చెల్లిస్తోంది. పది వేల మంది ఉండే క్యాంపస్‌లో చెత్తా చెదారం తీసుకెళ్లడానికి పురపాలక సంఘం ట్రాక్టర్లు రావు. కాని, ఇదే క్యాంపస్‌లో ఫుడ్ కోర్టుకు మాత్రం చెత్తను తీసుకెళ్లడానికి ట్రాక్టర్లు వస్తాయి. ఈ ఫుడ్ కోర్టు నడిపేది పురపాలక సంఘం నాయకులు కావడమేనా ? అని విద్యార్థుల ప్రశ్న. మెస్‌లలో అపరిశుభ్రంగా ఉండటమే కాక చెత్తా చెదారం నిండివున్న కుండీలు, డస్ట్ బిన్‌లను స్వయంగా చూసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా వాటిని వెంటనే క్లీనింగ్ చేయించి ఉంటే బాగుండేదని విద్యార్థులు అంటున్నారు.



క్యాంపస్‌లో ఫుడ్‌కోర్టు నుంచి చెత్తను సేకరిస్తున్న మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది

పెత్తనానికి చెక్..!



- వైసీపీ హయాంలో మునిసిపాలిటీలపై ఇతర శాఖల ఉద్యోగుల కన్ను
- కొందరు భారీ మొత్తంలో చెల్లించి కమిషనర్లుగా, ఇతర ముఖ్య విభాగాల్లో విధులు !
- భారీగా సొమ్ములు వసూళ్లు.. మునిసిపల్ ఉద్యోగులపై పెత్తనం
- కూటమి ప్రభుత్వం రాకతో ఈ విధానానికి చెక్.. సిబ్బంది హర్షం
- అయినా కొందరు పురపాలక సంఘాలకు వచ్చేందుకు యత్నం

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

మున్సిపాలిటీలపై ఇతర శాఖల పెత్తనానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. అయినా అధికారులు వీటిని ఏలేందుకు పైరవీలు చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. వైసీపీ హయాంలో ఇతర శాఖల నుంచి అధికారులు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి పార్టీ నేతలను ప్రసన్నం చేసుకున్నారు. కొందరు భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు పురపాలక సంఘాలకు కమిషనర్‌లుగా వచ్చి బాధ్యతలు చేపట్టారు. తర్వాత మున్సిపల్ సిబ్బందిపై పెత్తనం చెలాయించి వివాదాలకు కేంద్ర బిందువులయ్యారు. భారీస్థాయిలో సొమ్ములు పోగేసుకున్నారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. వాస్తవానికి మున్సిపల్ ఉద్యోగులను, అధికారులను ఇతర శాఖల్లో నియమించడం లేదు. ఇతర శాఖల నుంచి వచ్చిన వారికి మాత్రం మున్సిపాలిటీలలో చోటు కల్పిస్తూ కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలను కలిసి ఇతర శాఖల ఉద్యోగులను, అధికారులను మున్సిపాలిటీలను ఏలే బాధ్యతలను అప్పగించడంపై అభ్యంతరం తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించింది. తక్షణం అధికారులను బదిలీ చేసి సొంత శాఖలకు అప్పగించింది. డిప్యుటేషన్ విధానానికి స్వస్తి చెప్పింది. దీనిపై మున్సిపల్ ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి బదిలీపై సొంత శాఖకు వెళ్లిన మునిసిపల్ కమిషనర్లు మళ్లీ జిల్లా ఎమ్మెల్యేలతో సిఫార్సు లేఖలు ఇప్పించుకున్నారు. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కమీషనర్‌గా చేసిన డాక్టర్ శ్యామ్యూల్ పశుసంవర్థక శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఎన్నికల ముందు కూటమి నేతల ఫిర్యాదుతో కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం మళ్లీ ఇక్కడకు రావడానికి విశ్వ ప్రయత్నం చేశారు. కూటమి నేతలు అడ్డు తగలడంతో సొంత శాఖకు వెళ్లిపోయారు. తణుకులో కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన అధికారి డిప్యుటేషన్‌పైనే వచ్చారు. అతనిపైనా బదిలీ వేటు పడింది.

మున్సిపాలిటీలపై ఎందుకు ఆసక్తి

ఒకప్పుడు పురపాలక సంఘాలను ఆర్థిక ఇబ్బందులు వెంటాడేవి. ఉద్యోగులు వేతనాలకు కటకటలాడేవారు. వీరి వేతనాలను ప్రభుత్వమే ఇచ్చిన తరువాత మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితి కాస్త మెరుగుపడింది. మరోవైపు పన్ను విధానంలో మార్పులు వచ్చాయి. పట్టణాల ఆదాయం పెరిగింది. ఇప్పటికి పన్నుల రూపేణా ఏటా ఆదాయం పెరుగుతూ వస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రాజెక్టుల పేరుతో నిధులు మంజూరవుతున్నాయి. దీంతో ఇతర శాఖల అధికారుల కన్ను మున్సిపాలిటీలపై పడింది. దీంతో వీటిపై ఆసక్తి చూపుతున్నారు. రెవెన్యూ పంచాయతీరాజ్, పశుసంవర్ధక ఇతర విభాగాలలో పనిచేసే అధికారులు మున్సిపాలిటీలలో కమిషనర్‌లుగా చేరేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. సొమ్ములు చెల్లించి మరీ చేరుతున్నారు.

తప్పు చేస్తే చర్యలు లేని పరిస్థితి

మున్సిపాలిటీలకు వచ్చే ఇతర శాఖల అధికారులు తప్పులు చేస్తున్నారు. స్వంత శాఖలకు వెళ్ళిపోతున్నారు. ఆ తర్వాత విచారణ జరిగినా మున్సిపాలిటీలకు చర్యలు తీసుకునే అవకాశం లేదు. అధికారి సొంత శాఖకు వర్తమానం పంపాలి. సొంత శాఖ చర్యలు తీసుకోవాలి. లేదంటే మున్సిపాలిటీలలో తప్పు చేసి వెళ్లిన ఇతర శాఖల అధికారులపై చర్యలు తీసుకునే అవకాశమే లేదు. ఇటీవల కాలంలో టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులు కీలకంగా వ్యవహరించారు. ఇప్పుడు సొంత శాఖలకు వెళ్ళిపోయారు. కూటమి ప్రభుత్వం టీడీఆర్ బాండ్లపై విచారణకు ఆదేశించింది. సొంత విభాగాలకు వెళ్లిన అధికారులు మాత్రం తమకు ఏమీ కాదన్న ధీమాతో ఉన్నారు. ఇటువంటి తప్పులు చేయకుండా ఉండాలంటే ఇతర శాఖల నుంచి మునిసిపాలిటీలలో నియమించకపోవడమే మేలంటూ మున్సిపల్ ఉద్యోగుల నుంచి డిమాండ్ వినిపిస్తున్నది.

4 నుంచి మద్యం దుకాణాల సిబ్బంది నిరసనలు

భీమవరం క్రైం, ఆగస్టు 31 : రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం పాడాలనే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందిని రోడ్డున పడవేయవద్దని యూనియన్ నాయకులు వేడుకుంటున్నారు. ఐదేళ్ళ నుంచి తమకు కనీస వేతనం కూడా సమయానికి అందడంలేదని, పీఎఫ్, ఈఎస్ఐలతో పాటు ఓటీలు కూడా ఏజెన్సీలు తినేశాయన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అయినా తమకు మంచిరోజులు వచ్చాయని ఆశపడ్డామని పేర్కొన్నారు. కాని నూతన ప్రభుత్వమే మద్యం దుకాణాలు ప్రైవేటు పరం చేసి తమను రోడ్డున పడేయబోతున్నట్లు అనేక ప్రసార మాధ్యమాలు ద్వారా ప్రచారం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల ప్రైవేటు ప్రచారంపై కూటమి ప్రభుత్వం దాగుడుమూతలు ఆడకుండా తమకి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, లేనిపక్షంలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 4వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అవసరమైతే 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్ పిలుపునివ్వడం జరుగుతుందని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతున్నారు.

జవహర్ నవోదయ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 31 : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో 2025 జనవరి 18న నిర్వహించనున్న సెలక్షన్ టెస్ట్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ పరీక్షకు అర్హులు. ఈ జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్‌లో ఉత్తీర్ణులై ఎంపికైన వారికి 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరుటకు అవకాశం ఉందన్నారు. కావున జిల్లాలోని అన్ని యజమాన్య పాఠశాలల్లో ఈ సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కంటతడి పెట్టిస్తున్న శునకం విశ్వాసం


యజమాని ఫొటో ఎదుట శునకం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: యజమాని చనిపోయాడన్న విషయం జీర్ణించుకోలేక ఆ యజమాని ఫొటో ముందు ఒక శునకం (రాకీ) దీనంగా చూస్తున్న దృశ్యం చూపరులను కంటతడి పెట్టిస్తోంది. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు విహార యాత్రకు వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. యజమాని తిరిగి ఇంటికి విగత జీవిగా రావడంతో ఆ యజమాని ఫొటో ముందు శునకం అన్నపానీయాలు మాని దీనంగా నిల్చోవడం చూపరు లను కదిలిస్తోంది. ఏదో విధంగా ఆ రాకీకి ఎంతో కొంత ఆహారం తినిపించాలని ఆ కుటుంబ సభ్యులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇదే కదా విశ్వాసం అంటే.

వసతి గృహాల తనిఖీ


భోజన వసతులు పరిశీలిస్తున్న జడ్జి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: విద్యార్థులకు భోజన వసతుల కల్పనలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని మండల లీగల్ సర్వీస్ చైర్మన్, అదనపు 11వ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా సూచించారు. పట్టణంలోని బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్స్ గదులు, విద్యార్థులకు అందించే సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పశ్చిమ జిల్లా ఫైర్‌మెన్ ఎన్నిక


సత్యనారాయణ, గణేశ్

భీమవరం క్రైం, ఆగస్టు 31 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవలు శాఖ రాష్ట్ర కమిటీ కోశాధికారిగా జిల్లాకు చెందిన ఫైర్‌మన్ పీవీ సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఫైర్‌మన్ ఎం.గణేష్ సప్తగిరి ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నెల్లూరు జిల్లాకు చెందిన కె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా విశాఖపట్నం జిల్లాకు చెందిన పి.బాలకృష్ణ ఎన్నికయ్యారు.


శ్రీవారి కల్యాణ గానామృతం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు.. (ఇన్‌సెట్‌లో) గ్రామంలో ప్రదర్శనగా వస్తున్న భక్తులు

శ్రీవారి కల్యాణ గానామృతం

పెనుగొండ, ఆగస్టు 31: సిద్ధాంతం గ్రామంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి పద్మావతి కల్యాణ కథ గానామృతం కార్యక్రమం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నందమూరి గ్రామానికి చెందిన సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీనివాస పద్మావతి కల్యాణ గానామృతం నేత్రపర్వంగా నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు యక్కల త్రిమూర్తులు, భద్రావతి దంపతులచే ఈ కల్యాణ కార్యక్రమం ఎంతో భక్తిపారవస్యంతో నిర్వహించారు. స్వామి వార్ల పెళ్ళి చూపులు, కల్యాణానికి విడిది, కల్యాణం, తరువాత సారే పెట్టి అమ్మవారిని పంపించడం తదితర పెండ్లి తంతు అంతా కళ్ళకు కట్టినట్లుగా గానామృతం ద్వారా వారు ప్రదర్శించడంతో భక్తులు పరవశంతో మునిగిపోయారు. కల్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి గురువు యల్లపాటి ఆనందరావు నేతృత్వం వహించారు.


పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) ద్వారకాతిరుమలలో కుళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీరు

కలుషిత నీరు... అపారిశుధ్యం

ద్వారకాతిరుమలలో మహిళల ఆందోళన

ద్వారకాతిరుమల, ఆగస్టు 31: కొద్దిరోజులుగా తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ తూర్పు వీధి మహిళలు శనివారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళన చేశారు. అరకొరగా వస్తున్న నీరు మురుగుగా రావడంతో పాటు అందులో పురుగులు, ఇతర కీటకాలు కన్పిస్తున్నాయంటూ ఆవేదన చెందారు. కొన్నాళ్లుగా కుళాయిల ద్వారా ద్వారకాతిరుమలలో అధిక ప్రాంతాలకు కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నది. దీనికి తోడు పలు వీధుల్లో తాండవిస్తున్న అపారిశుధ్య పరిస్థితులతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. తూర్పు వీధి, అర్చకుల వీధి, మెయిన్‌బజార్ పలు ఇతర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోంది. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. కనీసం ట్యాంక్‌ను శుభ్రం కూడా చెయడం లేదు. పురాతన పైప్‌లైన్లు, లీకేజీల కారణంగా మురుగునీరు మంచినీటి పైపుల ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్నాయి. ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడంతో దానిపై నాచు పేరుకు పోయింది. పిచ్చిమొక్కలు మొలిచాయి.



నేలకొరిగిన భారీ వృక్షం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 31: పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో సుమారు వందేళ్ళ చరిత్ర కలిగిన భారీ వృక్షం శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా నేలకొరిగింది. చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్థంభాలు పడిపోయాయి. వెంటనే ట్రిప్ అవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే అటుగా వెళ్తున్న కారుపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎస్సై జబీర్ చెట్టు పడిన ప్రదేశాన్ని సందర్శించారు. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే చెట్టు కొమ్మలను నరికించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆలయం వద్ద ఆందోళన



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: మాధవరం గ్రామ దేవతల ఆలయంలో పారదర్శకత లోపించిందని లెక్కలు అడిగితే రాజకీయ రంగు పులుముతున్నారని మాధవరం గ్రామస్థులు నిరసన తెలిపారు. ఆలయం వద్ద శనివారం గ్రామస్థులు సమావేశమయ్యారు. గతంలో ఈ ఆలయ కమిటీ పదేళ్లుగా లెక్కలు చూపించకుండా నోటి లెక్కలతో ఆలయ నిర్వహణ చేస్తోందని, అదేమని ప్రశ్నిస్తే ఆలయంలో వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులుముతున్నారన్నారు. ఈ విషయమై ఆదివారం గ్రామసభ నిర్వహించి ఆలయ కమిటీ బాధ్యతలు సమర్థులకు అప్పగిస్తామని గ్రామ పెద్దలు నిర్ణయించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



ద్వారకాతిరుమల, ఆగస్టు 31: లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఆలయంలో పవిత్రావరోహణ, శ్రీమహాపూర్ణాహుతి హోమాన్ని అర్చకులు, పండితులు ఘనంగా జరిపారు. ముందుగా స్వామి, అమ్మవార్లు, ఇతర దేవేరులపై ఉంచిన దివ్యపవిత్రాలను వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు తొలగించారు. ఆ తరువాత ఆలయంలో పూర్ణాహుతి హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఇందులో శ్రీవారి దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా ఎన్టీఆర్: మంత్రి నిమ్మల



పాలకొల్లు, ఆగస్టు 31 : భారత దేశానికే సంక్షేమాన్ని పరిచయం చేసిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బ్రాడీపేట 2వ వీధి (బైపాస్‌రోడ్డు)లో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి నిమ్మల ప్రారంభించారు. విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే స్ఫూర్తి అని అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని అన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి నందమూరి తారక రామారావు అని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, జక్కంపూడి కుమార్, పొట్నూరి శ్రీనివాస్, దనాని ప్రకాష్, జీవీ సుబ్బారావు, రమేష్, బత్తుల మేరీ నిర్మల కుమారి పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహనకు మారథాన్ రన్

భీమవరం క్రైం, ఆగస్టు 31: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు అన్నారు. జిల్లాలో అవగాహన కార్యక్రమాలలో భాగంగా శనివారం నాడు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ప్రకాశం చౌక్ వరకు మారథాన్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో డా.బి భానూనాయక్, ఎయిడ్స్ ట్రీట్‌మెంట్ క్లస్టర్ ప్రోగాం మేనేజర్ మధుసూధనరావు మాట్లాడుతూ మారథాన్ రన్‌లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.7వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మార్యథాన్ రన్‌లో విజేతలు సెప్టెంబరు 3 న విజయవాడలో జరిగే స్టేట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఉమామహేశ్వరరావు, మధుసూధనరావు, డిఐసీ హరనాథ్, ఏఆర్టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోవిందబాబు, డాక్టర్ వి.రాంబాబు, కౌన్సిలర్స్ ప్రభాకర్, పూర్ణేంద్ర, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

వర్షాలతో 20 రైళ్ల రద్దు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో విజయవాడ దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో నడుస్తున్న రైళ్ళల్లో 20 రైళ్ళను రద్దు చేస్తూ శనివారం రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల మీదుగా వెళ్ళే రైళ్ళు కూడా ఉన్నాయి.

రైల్ నెంబర్ 17257 విజయవాడ - కాకినాడ పోర్టు ఈనెల 31వ తేదీన రద్దు చేశారు. 07885 భీమవరం జంక్షన్ - నిడదవోలు ఈనెల 31తేదీన రద్దు చేశారు. 07886 నిడదవోలు - భీమవరం జంక్షన్ ఈనెల 31తేదీన రద్దు చేశారు. 07281 నర్సాపూర్ - గుంటూరు ఈనెల 31 తేదీన రద్దు చేశారు. 17269 విజయవాడ - నర్సాపూర్ ఈనెల 31, సెప్టెంబర్1,2వ తేదీన రద్దు చేశారు

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం


ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 31 : భారతీయ సంస్కృతిలో పండుగలు ప్రధాన భాగమని, వాటిలో అతి ప్రధానమైన పండుగ వినాయక చవితి అని, ఆది దేవుడైన వినాయకుడిని ముందుగా పూజ చేసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను వాడలనే ప్రచార భేరి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించి బ్రోచర్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను వాడటం మంచిదని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల ద్వారా నిమజ్జనం చేసినప్పుడు కాలువల్లో చెరువుల్లో కాలుష్యంతో దెబ్బతింటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు. ప్రచార భేరి కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, గోపిశెట్టి మురళీ, జద్దు ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరం క్రైం: పర్యావరణ హితమైన వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నాడు జిల్లా ఎస్పీ అస్మి చేతుల మీదుగా ఏకో ఫ్రెండ్లీ గణేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ వంటి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో స్పేస్ ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, సభ్యులు రామాయణం సతీష్, జద్దు ప్రసాద్, వీరవల్లి మధు, జద్దు సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణహిత పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అస్మీ

మితిమీరిన స్వేచ్ఛ వల్లే చెడు ప్రభావాలు


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సభ్యులు

భీమవరం అర్బన్, ఆగస్టు 31 : నేడు సమాజంలో మితిమీరిన స్వేచ్ఛ వల్ల మహిళలపై చెడు ప్రభావం చూపుతోంది..నిజమైన స్వేచ్ఛ అనేది కేవలం నైతికతతోనే సాధ్యమని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుమారి ఫర్హానా అన్నారు. నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదాంతో సెప్టెంబర్ నెలలో అవగాహన ఉద్యమ ప్రారంభానికి సంబంధించిన బ్రోచర్లను శనివారం భీమవరంలోని శాఖ కార్యాలయంలో ప్రారంభించారు. జాతీయస్థాయి అవగాహన ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎన్‌సీఆర్‌బి 2022 రిపోర్ట్ ప్రకారం భారతదేశంలో ప్రతి రోజు 90అత్యాచార కేసులు నమోదవుతున్నాయని, యువత మద్యపానం, డ్రగ్స్ వంటి దురవ్యసనాల బారిన పడుతునారన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ దేశంలో 75సంవత్సరాలుగా సమాజ సంస్కరణకై కృషి చేస్తుందన్నారు.

క్రైం కార్నర్

ఎంపీటీసీ ఇంటిపై రాయితో దాడి


పగిలిన కిటికీ అద్దం

యలమంచిలి, ఆగస్టు 31: యలమంచిలి గ్రామంలో టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మి శ్రీనివాస్ ఇంటిపై శుక్రవారం అర్ధరాత్రి అగంతకులు రాయి విసరడంతో ఇంటి కిటికీ అద్దం పగిలిపోయింది. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ దుశ్చర్యకు పాల్పడిన అగంతకులను అధికారులు గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. ప్రజాప్రతినిధి ఇంటిపై అర్ధరాత్రి దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ నాయకులు బొప్పన హరికిషోర్, తాడి శశిధర్ తదితర నాయకులు పేర్కొన్నారు.

ఏటీఎం కార్డు చోరీ - కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : ఏటీఎం సెంటర్‌లో సొమ్ములను డ్రా చేసుకోవడానికి వెళ్ళిన వృద్ధురాలిని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసగించి కార్డును అపహరించి 20 వేల రూపాయలు డ్రా చేసుకున్నాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ సంఘటనకు సంబంధించి మేరుగు కాంతమ్మ (60) వట్లూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పక్కనే ఉన్న ఏటీఎంనకు డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్ళింది. అక్కడే గుర్తు తెలియని యువకుడు ఉండడంతో సొమ్ములు డ్రా చేసి ఇమ్మని కోరింది. అతను డ్రా చేసి ఇచ్చి ఆ కార్డును మార్చేశాడు. ఆ తరువాత కార్డులోని 20 వేల రూపాయలను అపహరించాడు. ఈ సంఘటనపై బాధితురాలు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : పని మనిషికి ఇంటిని అప్పగించి పని అయిన తరువాత తాళం వేసి వాచ్‌మెన్‌కు ఇచ్చి వెళ్ళాలని చెప్పి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం నేతాజీనగర్‌లో ఒక అపార్టుమెంటులో నివాసం ఉంటున్న చిన్నం విజయ్‌కుమార్ ఈనెల 28వ తేదీ ఉదయం తన భార్యతో కలిసి ఆశ్రం ఆసుపత్రికి బయలుదేరుతుండగా అంతలో వారి ఇంట్లో పనిచేసే మహిళ వచ్చింది. ఇంట్లో పని అయిన తరువాత ఇంటికి తాళం వేసి కింద ఉన్న వాచ్‌మెన్‌కు ఇచ్చి వెళ్ళాలని చెప్పారు. పనిచేసే మహిళ వారు చెప్పిన విధంగానే పని అయిన తరువాత తాళం వేసి తాళం చెవిని వాచ్‌మెన్‌కు ఇచ్చి వెళ్ళిపోయింది. ఆసుపత్రి నుంచి వచ్చి తాళం తీసి చూడగా తమ ఇంట్లోని మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో శనివారం రాత్రి వారి ఇంట్లో పని చేసే మహిళ కుమారి పై అనుమానం వ్యక్తం చేస్తూ విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ సీజ్

జీలుగుమిల్లి, ఆగస్టు 31: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఎస్ఐ పి.వినయ్‌కుమార్ సీజ్ చేశారు. దర్భగూడెం సమీప కాలువల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టరును సీజ్ చేశారు. బన్నె నాగార్జున, కుంజా వెంకటేశుపై కేసు నమోదు చేశారు.

జంగారెడ్డిగూడెం: తిరుమలాపురం గ్రామ శివారులో ఉన్న బైనేరు వాగులోని ఇసుకను అక్రమంగా ట్రాక్టరులో తరలిస్తున్న దొడ్డి వెంకట శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి ట్రాక్టరును అదుపులోకి తీసుకున్నట్లు హెచ్‌సి.భాస్కరరావు తెలిపారు.

డెంగీతో ఉలిక్కిపడ్డ అత్తిలి

ఆస్పత్రుల చుట్టూ జ్వరపీడితులు


అత్తిలిలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వేచి ఉన్న రోగులు

అత్తిలి, ఆగస్టు 31: అత్తిలి గ్రామానికి చెందిన ఆరేళ్ళ చిన్నారి డెంగీతో మృతి చెందిన విషయం తెలియడంతో అత్తిలి ప్రజలు ఉలిక్కిపడ్డారు. జ్వరాల విజృంభణతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలువురు ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ చికిత్స పొందుతున్నారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికి అధికశాతం ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో వైరల్ ఫీవర్స్ ఇంటికొకటి ఉన్నప్పటికీ వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాతావరణ మార్పులతో జ్వరాల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నది. డెంగీతోపాటు టైఫాయిడ్, విష జ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం కేసులు పెరిగాయని చెబుతున్నారు.

7 నుంచి 10 రోజుల పాటు జ్వరాలు

గతంలో వైరల్ జ్వరాలువస్తే మందులు వేసుకున్నా లేకున్నా మూడు నుంచి నాలుగు రోజుల్లో తగ్గిపోయేవి. ప్రస్తుతం కనీసం 7 నుంచి 10 రోజుల ఉంటుంది. ప్లేట్‌లెట్స్ వేగంగా పడిపోతున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయరాదని వెంటనే చికిత్స చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ.4 వేలు ఖర్చు...

డెంగీ, మలేరియా వంటి లక్షణాలతో రోగులు చికిత్సకు వెళుతుంటే వీరికి రక్త పరీక్షతోపాటు ఇతర వైద్య పరీక్షలకు మొత్తంగా రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందని బాధితులు చెబుతున్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా వందల సంఖ్యలో జ్వర పీడితులు కనిపిస్తున్నా వైద్యులు లెక్కలు మాత్రం నామ మాత్రంగా చూపిస్తున్నారు. అధికారులు వాస్తవాలను బయట పెట్టకుండా తక్కువ సంఖ్య చూపిస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటం, నీరు కలుషితం అవుతుండటం తదితర కారణాలతో ఎక్కువ మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లో ఎక్కువ మంది ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మృతురాలి ఇంటి పరిసరాల పరిశీలన


చదువుతున్న స్కూల్‌లో దోమల లార్వాను పరిశీలిస్తున్న హెల్త్ సిబ్బంది

అత్తిలి, ఆగస్టు 31: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు అన్నారు. డెంగీ జ్వరంతో గూనా నిత్య శ్రీ పద్మ అనే బాలిక మృతి చెందిన సంఘటనపై శనివారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి బాధిత కుటుంబ సభ్యులను కలుసుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ డెంగీ జ్వరంతో బాలిక మృతి చెందినదనడానికి ఎటువంటి నిర్ధారణ పరీక్షలు వారి వద్ద లేవని బాలిక తల్లి దండ్రులు చెప్పారన్నారు. ఇంటి పరిసరాలను పరిశీలించి వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థిని చదివిన ఎంఎం స్కూల్‌ను సందర్శించి పరిసరాల శుభ్రత, విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రతపై స్కూల్ యాజమాన్యంతో చర్చించారు. దోమల లార్వాను సేకరించి పరీక్షించారు. గ్రామంలో ఫీవర్ సర్వే జరుగుతోందని చెప్పారు. జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వారు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య పరీక్షలు జరిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవో పి శ్రీనివాసరావు, సబ్‌యూనిట్ అధికారి జి వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఏవో పి మురళీ, సిహెచ్ వెంకట్రావు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో అమ్మపేరుతో మొక్క


విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: అమ్మపేరు మీద ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రాంగణంలో ఈస్ట్‌కోస్ట్ టాల్ రకం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఎల్.నారంనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్గదర్శకులు గురువులే


పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, ఆగస్టు 31 : పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకులు గురువులేనని, గురువు లేని వ్యవస్థ, గురువులేని వారు లేరని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో జరగనున్న గురుపూజోత్సవ వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మహోపాధ్యాయుడిగా రాష్ట్రపతి స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆదివారం నుంచి ఐదో తేదీ వరకు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఇన్నర్ వీల్ క్లబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్నామని, 1,2,3 తేదీల్లో విద్యార్థులకు పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, అడబాల రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్ పుస్తకాలు అందజేత

పాలకొల్లు రూరల్, ఆగస్టు 31:స్థానిక కాపు వనితా క్లబ్ గవర్నర్ మాండటరీ ఎడ్యుకేషన్ ఈవెంట్స్‌లో భాగంగా పట్టణంలోని గరల్స్ హైస్కూల్లో విద్యార్థినులకు నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో గవర్నర్ యామన విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు దేవరపు కాంచనమాల, సిద్దారెడ్డి శైలజారాణి, మండెల లక్ష్మీభార్గవ, దేవరపు రామలక్ష్మి, తోట గాయత్రి, గంధం జ్యోతి, పాఠశాల హెచ్ఎం ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగించొద్దు

ఆకివీడు, ఆగస్టు 31 : అయి-భీమవరం రోడ్‌లోని కాల్వ గట్టు వెంబడి ఉన్న సుమారు ఎనభై ఇళ్లు తొలగించే ఆలోచన విరమించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం ఆయా బాధితుల ఇళ్లకు సీపీఎం నాయకులు వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నలభై ఏళ్ళ పైబడి ఉంటున్నామని ఇళ్లు తొలగిస్తే రోడ్డు పాలవుతామని వాపోయారు. దీనిపై పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు మాట్లాడుతూ అధికారులు, పాలకులు ఆలోచించాలన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించేందుకు హుకూం జారీ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో బొక్కా వర్మ, సందక సూరిబాబు తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీమవరంటౌన్, ఆగస్టు 31:విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాఘవ అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులు మేఘన, దివ్యశ్రీ పాల్గొన్నారు.

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

ఆచంట, ఆగస్టు 31 :జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా మూడో రోజు శనివారం వల్లూరులో చిట్టూరి అప్పారావు కుమారుడు రామకృష్ణ సహకారంతో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. జనసేన పార్టీ నాయకులు చిట్టూరి శ్రీనివాస్, తోట ఆదినారాయణ, కడిమి ఉమామహేశ్వరరావు, నల్లా రాధాకృష్ణ పాల్గొన్నారు.

'కారుమూరి కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మరు'

తణుకు, ఆగస్టు 31: మాజీ మంత్రి కారుమూరి కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన 80 రోజులు తర్వాత కారుమూరి కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ప్రజలకు మంచి చేస్తే వైసీపీని 11 స్థానాలకే ఎందుకు పరిమితం చేశారని విమర్శించారు. కారుమూరి కులాలు మధ్య కుంపట్లు రాజేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, వావిలాల సరళాదేవి, పితాని మోహన్, చిక్కాల వేణు, ఐ.శ్రీదేవి, తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు తదితరుల పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో అన్నసమారాధన



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 31: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని స్థానిక గణేష్‌నగర్‌లోని రాధాకృష్ణ ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి తనయుడు రాజేష్ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డీఎన్నార్‌లో పవర్ సిస్టమ్స్‌పై అవగాహన సదస్సు

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 31 : ప్రస్తుతం పవర్ సిస్టమ్స్ అనేవి ప్రధానంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగాన్ని నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఉండి సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం ట్రిపుల్‌ఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్, ట్రిపుల్ ఈ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కేబీవీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.


భీమవరం ఎస్ఆర్‌నగర్‌లో సచివాలయం వద్ద వర్షపునీరు.. ఆకివీడు పుంతల ముసలమ్మ ఆలయంలోకి నీరు.. కాళ్ల మండలం కోలనపల్లి – ఆకివీడు రోడ్డులో వర్షపునీరు.. ఉండిలో వర్షపునీటిలో వస్తున్న చిన్నారులు

జోరు వాన

- నీట మునిగిన పల్లపు ప్రాంతాలు
- రహదారులు జలమయం
- పొంగిపొర్లిన డ్రెయినేజీలు
- ఈదురుగాలులతో నేలకూలిన చెట్లు


ఉండిలో వర్షం..


రామన్నపాలెం అడవిపర్రులో చేలు

వాయుగుండం ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు జిల్లాలో ఎడతెరపిలేకుండా జోరు వాన కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురుగాలులతో పలు చోట్ల చెట్లు నేలకూలాయి. వరి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నరసాపురం టౌన్/మొగల్తూరు, ఆగస్టు 31: ఎడతెరపిలేని వానకు నరసాపురం పట్టణ, మండలంలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. స్టీమర్‌రోడ్, పొన్నపల్లి, నందమూరి కాలనీ, చలవపేట, కనకదుర్గ, శ్రీహరిపేట, భూపతివారి ప్రాంతాల్లో మోకాలు లోతు నీరు చేరింది. ప్రజలు రోడ్లపైకి రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్కెట్ బోసి పోయింది. చలవపేటలోని ప్రార్థన మందిరం వర్షపు నీటికి నీట మునిగింది. వరి పొలాలు చెరువులను తలపించాయి. ఇప్పటికే మత్స్యకారులు వేటకు వెళ్లొద్దంటూ మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బోట్లన్నీ తీరానికి చేరాయి. మొగల్తూరు మండలం మొగల్తూరు పెద్ద గొల్లగూడెం, పాతకాలువ సెంటర్, కోట రోడ్లు నీట మునగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొగల్తూరు గ్రామ సర్పంచ్ పడవల మేరీ పాతకాలువ సెంటర్‌లో నిలిచిన వర్షం నీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో ముంపు బెడద నివారించారు. పలు గ్రామాల్లో వరి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రామన్నపాలెం అడవిపర్రలో వ్యవసాయభూములు ఏరులను తలపిస్తున్నాయి. మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటే 92915 39408 కంట్రోల్ రూమ్ నంబర్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ విద్యాపతి సూచించారు.

- ఆచంట/పెనుగొండ/పెనుమంట్ర:ఆచంట మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెనుగొండ మండలంలో అధికారులు ఏవిధమైన సెలవులు పెట్టకూడదని తహసీల్దార్ అనిత సూచించారు. పెనుమంట్ర మండలంలో జోరు వర్షానికి ఈదురుగాలులు వీచడంతో వేల్పూరు- నత్తారామేశ్వరం రహదారిపై సోమరాజు ఇల్లిందలపర్రువద్ద రోడ్డుపక్కన ఉన్న నిద్రగన్నేరు చెట్టు నేలకు వరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామ పంచాయతీ అధికారులు చెట్టును తొలగించడంతో రాకపోకలు సాగాయి. మండలంలోని నత్తారామేశ్వరం, పొలమూరు, ఆలమూరు, మాముడూరు, నెలమూరు, మార్టేరు, నెగ్గిపూడి గ్రామాల్లోని పల్లపుప్రాంతాలకు నీరు చేరింది.
- ఆకివీడు/ఆకివీడు రూరల్/కాళ్ల/పాలకోడేరు/ఉండి, ఆగస్టు 31 : ఆకివీడులో రహదారులు చెరువులు కాల్వలను తలపించాయి. మురుగుబోదెలు పొంగి పొర్లాయి. దేవాలయాలు, ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సాలిపేట, అమృతరావునగర్ కాలనీ, తదితర లోతట్టు ప్రాంతాల్లోని పేదల ఇళ్ళు నీట మునిగాయి. ఆకివీడు మండలం చెరుకుమిల్లిలో శ్మశానం నీట మునిగింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు వెంకటేశ్వరరావు సూచించారు. కాళ్ల మండలంలో అంతర్గత రహదారులు సైతం కాల్వలను తలపించాయి. కాళ్ళ గ్రామంలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద ఉన్న కోలనపల్లి-ఆకివీడు రహదారి వర్షంతో అస్తవ్యస్తంగా తయారైంది. పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలో చాలా వీధుల్లో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు పన్నులు కడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని జ్వరాలు ప్రభలుతా యన్నారు. ఉండి మండలంలోని పలు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచింది. ఉండి బస్టాండ్‌లోని గుంతల్లోకి వర్షపునీరు చేరుకుంది. ఉండి, చెరుకువాడ, పెదపుల్లేరు, మహదేవపట్నం, కోలమూరు, చిలుకూరు, యండగండి తదితర గ్రామాల్లో రహదారులు మునిపోయాయి.
- తాడేపల్లిగూడెం రూరల్ : ఎర్రకాలువ పరీవాహక ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ సూచించారు. ఎడతెరిపి లేని వర్షాలకు ఎర్రకాలువ ఉధృతి పెరగడంతో శనివారం ఆయన ఎర్రకాలువను పరిశీలించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి నగేష్, కో-కన్వీనర్ రామగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్/యలమంచిలి : పాలకొల్లు పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రెయినేజీల్లో నీరుపైకి ఎగదన్నడంతో రోడ్లపైకి వర్షపు నీరు చేరుకుంది. శనివారం సంత కావడంతో కూరగాయల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యలమంచిలి మండలం యలమంచిలిలో వున్న ఉమాసోమేశ్వరస్వామి ఆలయ గర్భగుడిలోకి వర్షం నీరు చేరింది. ఆలయంలోకి చేరిన నీటిని బయటకు తోడేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


యలమంచిలి శివాలయంలోకి చేరిన వర్షపు నీరు

- అత్తిలి/ఇరగవరం : అత్తిలి మండలం అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్ నుంచి పాలూరు డ్యాం వరకు గల ఆర్అండ్‌బీ రహదారి వెంబడి వర్షం నీరు నిలిచి పోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. సంతాన గోపాలస్వామి వారి ఆలయ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించినా డ్రెయిన్ నిర్మించకపోవడంతో రోజులు తరబడి నీళ్లు నిలిచి ఉంటున్నాయి. ఇరగవరం మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామాల్లో శానిటేషన్ సరిలేక దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.
- గణపవరం : వర్షాలతో గణపవరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోయాయి. షాపులు సైతం మూతపడ్డాయి. ప్రజలు ఇళ్ళకే పరిమితం అయ్యారు. జనజీవనం స్తంభించింది. పల్లపుప్రాంతాలు జలమయం అయ్యాయి.


ఉండి బస్టాండ్‌లో నిలిచిన వర్షపునీరు


నీట మునిగిన చెరుకుమిల్లి గ్రామ శ్మశానం


మార్టేరు పోలేరమ్మ ఆలయం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



భీమవరంలో రిటైర్ అధికారులను సన్మానించిన ఎస్పీ అద్నాన్ నయీం అస్మి.. తణుకులో ఉద్యోగ విరమణ పొందిన యూబీఐ అధికారి వెంకటేశ్వరరావుకు సన్మానం

ఉద్యోగ విరమణ అధికారులకు ఘన సన్మానం

భీమవరం క్రైం, ఆగస్టు 31 : పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగ విరమణ పొందిన వారు చేసిన సేవలు ఎనలేనివని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విమరణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ శ్రీరామచంద్రమూర్తి, ఏఎస్ఐ జి.జాన్‌విక్టర్, ఏఎస్ఐ సీడీ గోవింద బాబులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తేనే మంచి గుర్తింపు : డీఎంహెచ్‌వో

- భీమవరంటౌన్ : సర్వీసులో ఉన్నప్పుడు పని చేస్తేనే మంచి గుర్తింపు వస్తుందని జిల్లా వైద్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జాతీయ కుష్టి నిర్మూలన కార్యక్రమంలో పలు హోదాలలో పనిచేసిన పారా మెడికల్ అధికారి గంటా ప్రతాప్ కుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన కె.వి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు.

యూబీఐ ఉద్యోగి వెంకటేశ్వరరావుకు సత్కారం

తణుకు : తణుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగ విరమణ పొందిన స్కేల్-2 అధికారి కె. వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానంచారు. శనివారం బ్యాంకు ప్రాంగణంలో ఉద్యోగు విరమణ సత్కార సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డి. ఇమ్మానియేల్, జీవీ చలం, కె. డానియేల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి : నాని


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వీసీ కొత్తపల్లి నాని

నరసాపురం, ఆగస్టు 31:నరసాపురం తీరంలో జ్వరాలు విజృంభిస్తున్నందున గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని మునిసిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని కోరారు. శనివారం భీమవరంలో కలెక్టర్ నాగరాణిని కలిసి 216 జాతీయ రహదారి పనులు చేపట్టిన కాంట్రాక్టరు పట్టణంలో డ్రెయినేజీ నిర్మాణాలను అసంపూర్తిగా నిలిచారన్నారు. దీనివల్ల కొద్దిపాటి వర్షాలకే రోడ్లన్నీ నీట మునిగిపోతున్నాయన్నారు. కలెక్టర్ స్పందిస్తూ మెడికల్ క్యాంపుల ఏర్పాటు, పెండింగ్ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

వ్యవసాయంలో 15 శాతం వృద్ధి పెంపుపై శిక్షణ

భీమవరంటౌన్, ఆగస్టు 31 :వ్యవసాయంలో ప్రస్తుతం వున్న వృద్ధిని 15 శాతానికి పెంచే విదంగా మండలస్థాయి వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వికాస భారత్ ప్రణాళిక తయారు చేయడంపై వ్యవసాయాధికారులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 శాతం పెంపుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. సీపీవో, డీఏవో, వ్యవసాయశాఖ డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు ఖరీఫ్-2024 వంటకాలానికి నిర్వహించే సీసీ ఎక్స్‌పర్‌మెంట్‌పై అవగాహన కల్పించారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

పెంటపాడు, ఆగస్టు 31: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 2వ తేదీన పట్టణంలోని మాగంటి కల్యాణ మంటపంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత చిరంజీవి యూత్ అధ్యక్షుడు స్వామి నాయుడు ఒక ప్రకటనలో కోరారు. జనసేన నాయకులతో పాటు మెగా అభిమానులు కూడా పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.


పాలిలో ఎమ్మెల్యే ఆరిమిల్లి.. తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి, గొర్రెల శ్రీధర్.. నరసాపురంలో పొత్తూరి రామరాజు, మొగల్తూరులో పింఛన్ల నగదు అందిస్తున్న కొవ్వలి నాయుడు, తదితరులు

ముందస్తు పింఛన్ల ఘనత చంద్రబాబుదే

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

- తణుకు/అత్తిలి/ఇరగవరం, ఆగస్టు 31: ప్రభుత్వం ఒక రోజు ముందుగానే నూరుశాతం పింఛన్లను లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారమే భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికార యంత్రాంగంతో పాటు కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛను తీసుకునేందుకు అందుబాటులో లేని వారికి రెండో తేదీన అందిస్తామని చెప్పారు. సాయంత్రం వరకు 96 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. అత్తిలి మండలం పాలి గ్రామంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ ఆల్తి సత్యనారాయణ, బుద్దాల వెంకటేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాసు, పూతినీడి శ్రీనివాసు, కొరిపల్లి హరి పాల్గొన్నారు. ఇరగవరం మండలం కావలిపురంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 93 శాతం పెన్షన్‌దారులకు సొమ్ము అందజేశామని, అందుబాటులో లేని వారికి సోమవారం అందజేస్తామని ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ తెలిపారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ :కూటమి ప్రభుత్వ హామీలన్నీ అమలు చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా సిబ్బంది పింఛన్ అందించడంపై అభినందించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ పాల్గొన్నారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణంలోని 10, 11వ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, ఆధికారి ఆనంతరామారావు, టి.లక్ష్మీనారాయణ, సూర్యకిరణ్, బాబీ పాల్గొన్నారు. మొగల్తూరు మండలంలో సుమారు 90 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ పూర్తిచేశామని ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. మొగల్తూరు మసీదు సెంటర్, కోట వద్ద తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి యతిరాజారామ్మోహన్‌నాయుడు పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. టీడీపీ నాయకుడు పాలా రాంబాబు, సంకు భాస్కర్ నాయుడు, బొల్లా చంటి తదితరులున్నారు.
- భీమవరం అర్బన్ : అన్ని రకాల పింఛన్లు పెంచి ఒక రోజు ముందుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు మెంటే గోపి, మద్దుల రాము, నేదునూరి గంగాధర్, మావుళ్ళయ్య జనసేన పార్టీ నాయకులు వానపల్లి సూరిబాబు, త్రివిక్రమ్, పాపోలు ఏడుకొండలు, ఫిరోజ్ పాల్గొన్నారు.
- ఉండి : ఉండి మండలంలో 8,876 పింఛన్లకు గాను 8,181 మందికి పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. వెలివర్రు గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు పింఛన్లను అందజేశారరు. పార్టీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి తదితరులు పర్యవేక్షణలో సచివాలయం ఉద్యోగులు పింఛన్ల పంపిణీ జరిపారు.
- ఆచంట : ఆచంట మండలం కోడేరులో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. 92.25 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


భీమవరంలో టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి


వెలివర్రులో పింఛన్లు అందిస్తున్న పొత్తూరి వెంకటేశ్వరరాజు


కమిషనర్ కృష్ణమోహన్‌ను నిలదీస్తున్న టీడీపీ, జనసేన కౌన్సిలర్లు

వీధులు మునిగినా పట్టించుకోరా..

- టీడీపీ, జనసేన కౌన్సిలర్ల ధ్వజం
- వాడివేడిగా ఆకివీడు కౌన్సిల్

ఆకివీడు, ఆగస్టు 31:ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణం మునిగిపోయినా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ధ్వజమెత్తి వాకౌట్ చేశారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. పట్టణంలోని వార్డులు నీట మునిగితే కమిషనర్ జి.కృష్ణమోహన్ పట్టించుకోలేదంటూ టీడీపీ, జనసేన కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, గోపిశెట్టి వెంకట సత్యవతి, గుర్రాని నాగలక్ష్మి సమావేశంలో నిలదీశారు. వారి నుంచి సమాధానం సక్రమంగా లేకపోవడంతో కౌన్సిలర్లు వాకౌట్ చేసి బయట కూర్చుంటే పట్టించుకోకుండా వైసీపీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్ర భుత్వం అధికారంలో లేనప్పుడు తమపై వివక్షత చూపారని, ప్రభుత్వం మారినా తమకు కమిషనర్ న్యాయం చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కమిషనర్ మాట్లాడుతూ తప్పయిందని, ఎప్పటికప్పుడు వర్షపు నీరు డ్రెయినేజీల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్లు, విప్, కౌన్సిలర్లు, మేనేజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.